క్లుప్తంగా

నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారికి పూజలు



దుర్గి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారిని తెనాలికి చెందిన జాగర్లమూడి స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీగిరి రాజు నరసింహ బాబు అసోసియేషన్ సభ్యులను శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తంగెడలో రాస్తారోకో

దాచేపల్లి : మండలంలోని తంగెడలో గ్రామస్తులు ఆదివారం రాస్తారోకో చేశారు. తంగెడ రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకలు సాగించటం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రోడ్డుపై ఉన్న దుమ్మంతా తమ నివాస గృహాల్లోకి వస్తోందని పేర్కొన్నారు. ఈ రోడ్డుపై భారీ వాహనాలను నియంత్రించాలని, రోడ్డులో ఏర్పడిన గుంతలు కూడా పూడ్చాలని కోరారు. పోలీసులు, స్థానిక నేతలు అక్కడకు చేరుకుని చర్యలు తీసుకుంటామని చెప్పటంతో ఆందోళన విరమించారు.

11న బైబిల్ క్విజ్

మాచర్ల: క్రైస్తవుల్లో ఆధ్యాత్మిక భావం పెంచేందుకు ఈనెల 11న గురజాల పట్టణంలో బైబిల్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహక కన్వీనర్ బ్రహ్మనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 11న గురజాల తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో యోహాను సువార్త బైబిల్ క్విజ్ పోటీలు జరుపుతున్నట్టు వివరించారు. క్విజ్‌లో ముగ్గురు బృందంగా పాల్గొనవచ్చని, ఆరో తేదీ లోపు రిజిస్టర్ చేసుకోవాలని వివరించారు. మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.ఐదు వేలు, మూడో బహుమతిగా రూ.మూడు వేలు, సర్టిఫికెట్లు అందజేస్తామని వెల్లడించారు. క్విజ్ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు ఇస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు 9848343195 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

చింతలపూడి ట్రస్టు కృషి ప్రశంసనీయం




పిడుగురాళ్ల/పిడుగురాళ్లరూరల్ : చింతలపూడి చారిటబుల్ ట్రస్టు ద్వారా పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని 23వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ జూలకంటి శ్రీరంగ రజనీ చెప్పారు. జానపాడులో ట్రస్టు ఆధ్వర్యంలో మన బిడ్డ మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా షేక్ సైదా నాగులు కుమార్తె మషీరా వివాహం సందర్భంగా కల్యాణ కానుక అందించారు. బంగారు ఉంగరంతోపాటు పట్టుచీర సారెను కౌన్సిలర్ రంగరజనీ చేతుల మీదుగా వధువుకు అందజేశారు. కార్యక్రమంలో చింతలపూడి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు, పల్నాడు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

రామ్మోహన్‌రావుకు నివాళులు



మాచర్ల: ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకులు స్వర్గీయ రామ్మోహన్‌రావు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం మాచర్ల ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో నిర్వహించారు. ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి మురారి, అధ్యక్షులు కొరటా నరహరి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతి ముత్యాలరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కె.రాము, బాలశౌరి తదితరులు రామ్మోహన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థలో మూడు దశాబ్దాల పాటు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్యారేజీ సిబ్బంది, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెట్టుబడుల సదస్సు జయప్రదంపై సంబరాలు



పిడుగురాళ్ల : విశాఖపట్నంలో ప్రభుత్వం నిర్వహించిన పెట్టుబడుల సదస్సు జయప్రదమైన సందర్భంగా ఆదివారం పట్టణంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు జబీర్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. పెట్టుబడుల సదస్సు రాష్ట్ర భవితను మార్చబోతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సు కోసం

- ప్రతి ఇంటికీ కుళాయి
- ప్రారంభమైన జలజీవన్ మిషన్ పనులు
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి విశేష కృషి ఫలితమే



గురజాల : చెంతనే కృష్ణమ్మ ఉన్నా.. గురజాల నియోజకవర్గ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పేవి కావు. గతంలో ప్రభుత్వాల అలసత్వం వల్ల వేసవి వచ్చిందంటే నీటికి కటకటలాడాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం పరిస్థితిలో మార్పు వస్తోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిని అమర్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టింది. దీనికితోడు సమృద్ధిగా వర్షాలు పడడంతో కాలువలు, జలాశయాల్లో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. భూగర్భ జలాలు మెరుగయ్యాయి. దీంతో గ్రామాల్లోని చెరువులను నీటితో పూర్తిగా నింపారు. చేతిపంపుల మరమ్మతులూ చేపడుతున్నారు. ఫలితంగా ప్రజలకు ఉపశమనం లభిస్తోంది.

తొలివిడతగా రూ.39.76 కోట్లు

నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ జలజీవన్ మిషన్ ద్వారా కుళాయి అందించాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. విశేష కృషి చేశారు. పైప్‌లైన్ పనులు చేపట్టేందుకు చొరవ చూపారు. తొలివిడతగా 52 పనులకు రూ.39.76 కోట్లు, రెండో విడతగా 41 పనులకు రూ.41.34 కోట్లు మంజూరు చేయించారు. మొదటి విడతలో భాగంగా ఇప్పటికే మాచవరం, కొత్తపాలెం, తురకపాలెం, చెన్నాయపాలెం, మోర్జంపాడు గ్రామాలతోపాటు దాచేపల్లి మండలంలోని కాట్రపాడు, సారంగపల్లి అగ్రహారం, శంకరాపురం, గామాలపాడు గ్రామాల్లో పనులు ప్రారంభించారు. గురజాల మండలంలోని అంజనాపురం, పిడుగురాళ్ల మండలంలోని వెల్లంపల్లి, పెద అగ్రహారం గ్రామాల్లో పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ సాగుతోంది. ఇప్పటికే పిడుగురాళ్ల పట్టణంలోని 5,600 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఈ ఏడాది వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 2,001 చేతి పంపులు ఉన్నాయి. గురజాల మండలంలో 516, దాచేపల్లి మండలంలో 396, మాచవరం మండలంలో 402, పిడుగురాళ్ల మండలంలో 687 పంపులు ఉన్నాయి. వేసవి రానున్న దృష్ట్యా వీటికి మరమ్మతులు చేయించేందుకు కృషి చేస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు.

సమగ్ర ప్రణాళికతో ముందుకు..



నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నాం. సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ఇప్పటికే పిడుగురాళ్ల పట్టణంలో 5,600 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చాం. మిగిలిన గృహాలకూ ఇస్తాం. పైప్‌లైన్ల నిర్మాణం జరుగుతోంది. గ్రామాల్లోనూ జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయి.

– కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్యే గురజాల

బాలస్వామిరెడ్డికి అభినందనలు



బాలస్వామిరెడ్డిని సత్కరిస్తున్న రెడ్డి సేవా సమితి సభ్యులు

మాచర్ల: వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సి.హెచ్.బాలస్వామిరెడ్డికి అభినందనలు అని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కురి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గోయ రఘురామిరెడ్డి చెప్పారు. పట్టణంలోని చక్ర డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన బాలస్వామిరెడ్డి అభినందన సభలో వారు మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా దీర్ఘకాలికంగా ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో పనిచేసిన బాలస్వామిరెడ్డిని జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడుగా ఎంపిక చేయడం ఎంతో సంతోషకరమని వక్తలు పేర్కొన్నారు. రెడ్డి జనసేవాసమితి ఆధ్వర్యంలో మాచర్ల మండలి ఉపాధ్యక్షుడు టి.కోటిరెడ్డి, జి.రాజశేఖర్ రెడ్డి, జనసేవా సమితి అధ్యక్షులు వెన్నం నలవెంకట రెడ్డి, శౌంతిరెడ్డి నాగిరెడ్డి, గిరవర్ధనరెడ్డి, మహేష్‌రెడ్డి ఆయనను అభినందించి పూలమాల, శాలువాలతో సత్కరించారు.

సత్రశాలలో వసంతోత్సవం



ప్రత్యేక అలంకారంలో గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి

సత్రశాల(రెంటచింతల): సత్రశాల వద్ద పవిత్ర కృష్ణానదీ తీరాన ఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆదివారం వసంతోత్సవాలు వైభవంగా జరిగాయి. ప్రధాన అర్చకులు చిట్యాల మల్లికార్జునశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. మహాశివరాత్రి వెళ్లిన 16 రోజుల తరువాత ఈ వసంతోత్సవాన్ని జరపడం ఆనవాయితీగా వస్తోంది. మహిళలు కుంకుమార్చన చేసి అమ్మవారి దీవెనలను పొందారు. భ్రమరాంభికాదేవి అమ్మవారు, మల్లికార్జున స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి దంపతులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వందలాదిమంది భక్తులు స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈఓ గాదె రామిరెడ్డి, దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు ఆరికట్ల నర్సింహారెడ్డి, మూఢావత్ కొండానాయక్, గువ్వల పెద్ద సైదులు, దాడిబత్తిన కమలమ్మ, జినుగు పేరమ్మ, ఉసిరిక పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల నుంచి మంచి స్పందన



అమూల్ సెంటరు పరిశీలిస్తున్న అధికారులు

శావల్యాపురం: పాల ఉత్పత్తిదారుల నుంచి మంచి స్పందన వస్తున్నట్లు మండల అమూల్ పాల సేకరణ పర్యవేక్షణ అధికారి షేక్ అబ్దుల్ బాషా ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ప్రతిరోజు 1500 లీటర్ల పాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. 10 శాతం లీటరు పాల ధర రూ.78లు, 11శాతం ఉంటే రూ.85లు అమూల్ సంస్థ పారదర్శకంగా బిల్లులు నెలలో రెండు సార్లు పాల ఉత్పత్తిదారులు బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తుందన్నారు. ఇప్పటి వరకు పాల ఉత్పత్తిదారులకు బిల్లులు పెండింగ్ లేదన్నారు. ఆయనతో పాటు వేల్పూరు సెక్టారు పశువైద్యాధికారి పలిపర్తి గణేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పిడుగురాళ్లకు చెందిన విజయ నర్సింగ్ హోమ్ వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరాన్ని నరసరావుపేటకు చెందిన ప్రముఖ న్యాయవాది మోదుగుల ఆరోగ్యం చౌదరి ప్రారంభించారు. వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ కె.వి.సుబ్బారావు, ఎం.ఫణికుమార్, ఎం.వి.ఎస్. సునీల్ కుమార్ పాల్గొని వైద్యసేవలు అందించారు. ఈ వైద్య శిబిరములో గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 127 మందికి గుండె, ఊపిరితిత్తులు, నరాల బలహీనత, నెమ్ము, డెంగీ, మలేరియా సంబంధిత వ్యాధులకు సాధారణ వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఈసీజీ పరీక్షలు చేశారు. ఆయా వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వైద్యులు గ్రామస్తులకు వివరించారు.

ప్రతిఒక్కరూ చదువుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ అబ్దుల్ నజీర్ పక్కన మౌలానా షర్ఫుద్దీన్, ఎండీ ఉస్మాన్ మేస్త్రీ



మసీదులో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మత పెద్ద

పిడుగురాళ్ల : ప్రతి ఒక్కరూ చదువుకోవాలని కాళికట్ గ్రాండ్ ఖాజీ సయ్యద్, అబ్దుల్ నజీర్, పుంగనూర్ మౌలానా షర్ఫుద్దీన్‌లు సూచించారు. పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో మసీద్ సూఫీకి ఆదివారం ప్రారంభోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కాళికట్ గ్రాండ్ ఖాజీ సయ్యద్, అబ్దుల్ నజీర్, పుంగనూర్ మౌలానా షర్ఫుద్దీన్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కుటుంబంలో ఒకరు చదువుకుంటే ఇంటికి వెలుగుగా మారతారని చెప్పారు. అందరికీ విద్యనందిచాలనేది హదియా నేషనల్ ఇస్లామిక్ ఎడ్యుకేషనల్ సొసైటీ లక్ష్యమని పేర్కొన్నారు. ఇస్లామిక్ అరబిక్‌తోపాటు ఇంగ్లిషు కూడా పాఠశాలలో బోధిస్తామని వివరించారు. అనంతరం అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్ మేస్త్రీ మాట్లాడుతూ విద్యతోటే జ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం మసీద్‌ను ప్రారంభించారు. మసీద్‌లో ఏర్పాటుచేసిన ఇస్లామిక్ పాఠశాలను ప్రారంభించి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

ప్రయాణికుల క్షేమమే ముఖ్యం

రైల్వే డీఆర్ఎం రామకృష్ణ



సమస్యలపై డీఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

దాచేపల్లి : రైల్వే ప్రయాణికుల క్షేమమే తమ లక్ష్యమని డీఆర్ఎం ఎం.రామకృష్ణ చెప్పారు. నడికుడి రైల్వేస్టేషన్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. పలు సమస్యలపై స్థానికులు డీఆర్ఎంకు వినతిపత్రం అందించారు. డీఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని 16 రైల్వేస్టేషన్లను ప్రధానమంత్రి అమృత భారత్ పథకం ద్వారా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రయాణికులకు అన్ని సౌకర్యాలనూ కల్పిస్తామని చెప్పారు. విశ్రాంతి గదులు, ఫుట్‌బ్రిడ్జిలు, లిఫ్ట్ వసతులు కల్పిస్తామని వివరించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

న్యాయమూర్తి బి.దేవేంద్రరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి బి.దేవేంద్రరెడ్డి

నరసరావుపేట రూరల్: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.దేవేంద్రరెడ్డి తెలిపారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు ఆదివారం లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. మహిళా హక్కులు, బాల్యవివాహాలు, ఉచిత న్యాయ సహాయం, భరణం, గృహహింసా చట్టం తదితర చట్టాలపై వివరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి దేవేంద్రరెడ్డి మాట్లాడుతూ మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. మహిళలు, యవతులు, బాలికలు ఎలాంటి సమస్యలు ఉన్నా ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్స్ ఎస్‌బీఏ ఝాన్సీ, కె.కాళిదాసు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

చిలకలూరిపేట టౌన్: దేశంలో మహిళలపై దాడులపై అప్రమత్తంగా ఉండాలని మండల సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వారికి సంబంధించిన అన్ని చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ చట్టాలు పోక్సో, గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎన్.శ్రీనివాసులు, భానుప్రసాద్, తోట రామాంజనేయులు, పోతుల వెంకట్, రాజేష్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నిరంతరం కృషి చేస్తోందని సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎల్.వి.రామిరెడ్డి తెలిపారు. మున్సిపల్ బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం ఎస్టీయూ మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామిరెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. మున్సిపల్ హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులకు డీడీఓ అధికారాలు ఇవ్వాలని కోరారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలల పర్యవేక్షణ సమయంలో అనుచితంగా వ్యవహరించటం తగదన్నారు. మధ్యాహ్న భోజనం పథకం అమలులో ఉపాధ్యాయులను తప్పించాలని కోరారు. ఈసందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 30మంది ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎం.సుభాని, జె.గంగాధరబాబు, రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు డి.పెదబాబు, యు.చంద్రజిత్‌యాదవ్, గౌరవాధ్యక్షుడు షేక్ కరిముల్లా పాల్గొన్నారు.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో బండ్లమ్మవారు

చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులోని శ్రీ బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఫాల్గుణ మాసం రెండవ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దేవాలయం కిటకిటలాడింది.

14న హోమం..

బండ్లమ్మవారి దేవాలయంలో ఈ నెల 14న ప్రత్యేక హోమం నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు. ప్రతి మంగళవారం వివాహం కాని యువతులకు, ప్రతి శుక్రవారం వివాహం కాని యవకులకు హరిద్ర శృంగార్చన పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఏడు వారాలు పూజలు చేసిన.. యువతీయవకులు ఈ ప్రత్యేక హోమంలో పాల్గొనాలని తెలిపారు. సత్వర వివాహ ప్రాప్తి కలుగుతుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి, ఆలయ వంశపారంపర్య అర్చకులు కుంచల నరసారెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపిస్తే చట్టపరమైన చర్యలు




వినుకొండ(నూజెండ్ల): ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి.పాలేష్ అన్నారు. వినుకొండ రూరల్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కులాలపై వివక్ష చూపిస్తే చర్యలు తీసుకునేందుకు చట్టాలు ఉన్నాయని గుర్తుచేశారు. గ్రామాల్లో వివక్షత చూపిస్తే కమిటీని ఆశ్రయించవచ్చని సూచించారు. ఎస్సీ కాలనీలో విద్యుత్ బిల్లుల సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు తెలపడంతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహకారంతో పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం పాలేష్‌ను ఎస్సీ కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జోజిబాబు, కందుకూరి శ్యాం, అమృతపూడి ఐడ్రాజ్, ఇమ్మానుయేలు, యాకోబు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1990–91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు పాఠశాల మొత్తం కలయ తిరిగి తరగతి గదులలో ఉపాధ్యాయులతో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు. విద్యార్థులుగా తాము చేసిన తీపి గుర్తులను స్మరించుకొంటూ సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులు మురళీధర్, రసూల్ మాస్టార్లను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు కల్లూరి ఆంజనేయులు, రాచకొండ కోటేశ్వరరావు, నలబోతు రవికుమార్, గంటా వీరారెడ్డి, ఆకుల వెంకటేశ్వర్లు, పూరేటి శ్రీనివాసరావు, బొల్లు రామారావు పాల్గొన్నారు.

వినుకొండలో బీ న్యూ షోరూమ్ ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న నిఖిలేష్, సిబ్బంది

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలో ప్రముఖ మొబైల్, ఎలక్ట్రానిక్ షోరూమ్ బీ న్యూ ఆదివారం ప్రారంభించారు. పట్టణంలోని కొత్తపేటలో షోరూమ్ ప్రారంభం సందర్భంగా కంపెనీ సీఈఓ యర్రగుంట సాయి నిఖిలేష్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలల్లో 8 ఏళ్లుగా 50 లక్షలమంది వినియోగదారుల నమ్మకాన్ని తమ సంస్థ చూరగొన్నదని అన్నారు. వినుకొండలో 147వ షోరూమ్‌ను ప్రజలకు అందు బాటులోకి తెచ్చినట్లు చెప్పారు. మా షోరూమ్‌లో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మొబైల్ ఫోన్లు, ఆన్‌లైన్ ధరల కంటే తక్కువగా వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయన్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నూతన మొబైల్‌ఫోన్లు, ల్యాప్ ట్యాప్‌లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, ఎల్ఈడీ టీవీలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.